

భూములపై హక్కు కల్పించండి
సింగారాయపాలెంలోని జాగీర్దార్ భూములపై తమకు హక్కు కల్పించాలని రైతులు ఆర్డీఓకు విన్నవించారు.
8లో



రోడ్డెక్కిన అన్నదాతలు
బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆయకట్టుకు నీరందడం లేదని ఆరోపిస్తూ రైతులు రాస్తారోకో చేపట్టారు.
10లో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 19°

వాతావరణం
బుధవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉదయం నుంచి ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరిగే సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

61 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించగా, 61మంది సర్టిఫికెట్లకు అర్హులుగా గుర్తించారు. ఈమేరకు స్లాట్ బుక్ చేసుకున్న 120మందిలో 108 మంది హాజరుకాగా, వైద్యులు వైకల్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో వివిధ విభాగాల్లో 61 మందిని అర్హులుగా గుర్తించి సరదమ్ సర్టిఫికెట్లు జారీ చేశారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం(సెట్‌కం) ఆధ్వర్యాన నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, రిఫ్రిజిరేటర్లు, ఏసీ మెకానిక్ రంగాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు సెట్విన్ ఆధ్వర్యాన పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఖమ్మం బుర్హాన్‌పురంలోని సెట్‌కం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 99482 07271 నంబర్‌లో సంప్రదించొచ్చని తెలిపారు.

ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు మార్పు

ఖమ్మంక్రైం: ఖమ్మం రేంజ్ పరిధిలోని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు కేటాయించారు. ఈవిషయాన్ని రేంజ్ డీఎస్పీ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నంబర్లు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయని.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల అవినీతిపై ఇక నుంచి ఇవే నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

డీఎస్పీ	91543 88981
సీఐ, ఖమ్మం వన్ టౌన్	91543 88984
సీఐ, ఖమ్మం టు టౌన్	91543 88986
ట్రోల్ ఫ్రీ నంబర్	1064

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం



జన్నారంలో మిర్చిని పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

ఏన్కూరు: మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తామని డీఆర్డీఓ విద్యాచందన తెలిపారు. మండలంలోని హిమామ్‌నగర్, జన్నారం గ్రామాల్లో నర్సరీలు, మిర్చి కల్లాలను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్లాంట్ లిపిడ్ సంస్థ ద్వారా ఐకేపీ ఆధ్వర్యాన గ్రామాల రైతుల నుంచి మిర్చి కొనుగోళ్లు చేస్తామని, సంస్థ ప్రతినిధులతో మాట్లాడి గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు. డీపీఎం శ్రీనివాస్, ఎంపీడీఓ బయ్యాపు అశోక్, ఏపీఎం హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన మత్స్యకారులు సభ్యత్వం పొందాలి

చింతకాని: అర్హులైన మత్స్యకారులు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లోసభ్యత్వం పొందాలని జిల్లా మత్స్యశాఖాధికారి ఆంజనేయ స్వామి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులతో సమావేశమై మాట్లాడారు. సంప్రదాయ మత్స్యకార కుటుంబాల్లో 18 నుంచి 55 ఏళ్ల లోపు వయస్సు వారు సభ్యత్వం తీసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని వంద సంఘాల్లో 3,361 మందికి సభ్యత్వాలు ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి తరలింపునకు పరిశీలన

ఖమ్మం సహకారనగర్: పాత కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌లో ఉన్న ఎన్నికల సామాగ్రిని భద్రపరిచేందుకు అనువైన ప్రదేశాల ఎంపికలో అధికారులు నిమగ్నమయ్యారు. గోడౌన్‌లో బ్యాలెట్ బాక్స్‌లు, ఈవీఎంలు ఉండగా అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ మంగళవారం జెడ్పీ ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్, పాత డీపీఓ కార్యాలయం, మహిళా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాళ్లబండి రాంబాబు, సిబ్బంది హుస్సేన్, రాంరాజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధిలో కోత



వచ్చే ఆర్థిక సంవత్సరం తగ్గనున్న పనిదినాలు

- 65,33,104 పనిదినాలకే ప్రతిపాదనలు
- ప్రస్తుత ఏడాదితో పోలిస్తే 16 లక్షల పనిదినాల తగ్గింపు
- అండగా ఉంటున్న పనుల తగ్గింపుపై ఆందోళనలో కూలీలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వ్యవసాయ పనులు లేని సమయాన గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఉపాధి మార్గంగా ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై నానాటికీ భరోసా తగ్గిపోతోంది. ఏటేటా తగ్గుతున్న పనిదినాలతో కూలీలు అడిగింత మేర పని కల్పించే పరిస్థితి కానరావడం లేదు. ప్రతీ సంవత్సరం గత ఏడాది కంటే ఎక్కువ పనిదినాలతో ప్రతిపాదనలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు జిల్లా అధికారులు పంపించడం ఆనవాయితీ. ఈమేరకు 2021–22లో 1.31 కోట్ల పనిదినాలను ప్రతిపాదించగా.. 2022–23(ప్రస్తుత ఆర్థికసంవత్సరం)లో ప్రభుత్వం జిల్లాకు 81 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించింది. ఇందులో ఇప్పటి వరకు 52,98,607 పనిదినాలు పూర్తిచేశారు. మిగతా పని దినాలు పూర్తిచేసేందుకు నలభై రోజుల సమయమే ఉండగా... రానున్న ఆర్థిక సంవత్సరానికి అధికారులు మరిన్ని పనిదినాలు తగ్గించి ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం గమనార్హం.

65.34 లక్షల పనిదినాలే...

2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనిదినాల ప్రణాళికను అధికారులు పూర్తి చేశారు. ప్రస్తుత ఏడాది పనిదినాలను ప్రామాణికంగా తీసుకుని వచ్చే ఆర్థిక సంవత్సరం జిల్లాలోని కూలీలకు 65,33,104 పనిదినాలు అవసరమని ప్రతిపాదనలు చేశారు. ఇందులో అత్యధికంగా వచ్చే మే నెలలో 21,68,640 పనిదినాలు అవసరమని ప్రతిపాదనల్లో పొందుపర్చారు. ఇక ఏప్రిల్‌లో 7,89,289, జూన్‌లో 12,51,341 పనిదినాలు అవసరమని అధికారులుపేర్కొన్నారు.

గతంలో పెంపు.. ఇప్పుడు తగ్గింపు

జిల్లాలో ఉపాధి పనిదినాలను ఏటేటా తగ్గిస్తూ వస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు పనిదినాల సంఖ్యను పెంచుకుంటూ వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు తగ్గిస్తోంది. బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, సాఫ్ట్‌వేర్‌లలో మార్పులతో జిల్లాలో పనిదినాల సంఖ్య తగ్గించినట్లుగా తెలుస్తోంది. జిల్లాలో వంద రోజుల పనులు పూర్తిచేసే కుటుంబాలు అనేకం ఉన్నా ఆ మేరకు పనిదినాలను కేటాయించడం లేదని కూలీల నుంచి విమర్శలొస్తున్నాయి. ఈ ఏడాదితో పోలిస్తే వచ్చే ఏడాది 16 లక్షల వరకు పనిదినాలు తగ్గనుండడంతో ఉపాధి హామీకి కూలీలు దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

మూడు నెలల్లోనే మూడొంతులు..

గ్రామీణ ప్రాంతాల్లో పేదలు వ్యవసాయ పనుల తర్వాత అత్యధికంగా ఉపాధి హామీ పనులనే వినియోగించుకుంటారు. జిల్లాలో జూలై నుంచి ఫిబ్రవరి – మార్చి వరకు వ్యవసాయ పనులు ఉండటంతో కూలీలు అటే మొగ్గు చూపుతారు. ఇక ఏప్రిల్, మే, జూన్‌లో కుటుంబ పోషణకు ఉపాధి పనులను వినియోగించుకుంటారు. దీంతో అధికార యంత్రాంగం కూలీల అవసరాలనికి అనుగుణంగా వచ్చే ఏడాదికి ఉపాధి హామీ పనిదినాల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆర్థిక సంవత్సరానికి మొత్తం ప్రతిపాదనలు చేసిన పనిదినాల్లో మూడొంతుల పనిదినాలను ఏప్రిల్, మే, జూన్ నెలలకే కేటాయించారు.

పని తగ్గిస్తే బతకడం ఎలా?



ఉపాధి హామీ పథకంలో పని దినాలు తగ్గిస్తే మాలాంటి నిరుపేద కూలీలు ఎలా బతకాలి? అందరికీ పని కల్పిస్తారనుకుంటే ఉన్నవి తగ్గించడం సరికాదు. కూలీలకు సరిపడా పనిదినాలతో పాటు వేతనాలు కూడా పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి.
– కస్తాల వెంకట్రాములు, అనంతనగర్, నేలకొండపల్లి మండలం

ఉపాధి పనులు తగ్గించొద్దు



నేను, నా భర్త ఏటా ఉపాధికూలీ పనులకు వెళ్తూ ఇద్దరం వంద రోజులు పూర్తిచేస్తున్నాం. వ్యవసాయ పనులు లేనప్పుడు ఈ పనులతో భరోసా ఉంటుంది. కానీ ఇప్పుడు పనులు తగ్గిస్తారని చెబుతున్నారు. అదే జరిగితే మాలాంటి వాళ్లకు ఇబ్బందిగా మారుతుంది. ఈ విషయాన్ని గుర్తించి పనులు తగ్గించొద్దు. – లోడిగ నాగమణి, గట్టుసింగారం, కూసుమంచి మండలం



2022-23లో పనిదినాల కల్పన ఇలా..	మొత్తం పనిదినాలు	పనులు చేసిన కుటుంబాలు	పని చేసిన కూలీలు	ఇప్పటి వరకు పూర్తయిన పనిదినాలు
	81 లక్షలు	1,41,255	2,28,997	52,98,607

సంక్షేమ పథకాల్లో నంబర్ వన్



రొట్టమాకురేవులో రైతు వేదిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

- ఎంపీ నామా నాగేశ్వరరావు
- మండలంలో రైతు వేదిక భవనాలు ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వెల్లడించారు. మండలంలోని ఉసిరికాయపల్లి, అప్పాయిగూడెం, రొట్టమాకురేవుల్లో రైతు వేదిక భవనాలను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే రాములునాయక్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రొట్టమాకురేవులో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

గత ఎన్నికల్లో నాకు నష్టం..

ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత లోక్‌సభ ఎన్నికల్లో తనకు కారేపల్లి మండలం నుంచి తీవ్ర నష్టం జరిగిందని వెల్లడించారు. ఈ లెక్కలన్నీ తన వద్ద ఉన్నాయని, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వారెవరో అందరికీ తెలుసునని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనైనా అలా జరగకుండా చూడాలని సూచించారు. కాగా, ఎంపీ ల్యాడ్ నిధులు నుంచి నాలుగు గ్రామాలకు రూ.20లక్షలు, నామా ముత్తయ్య ట్రస్టు నుంచి బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ మంచి హృదయం ఉన్న ఎమ్మెల్యే రాములునాయక్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. అయితే, ఏడేళ్ల బీఆర్‌ఎస్ పదవులు అనుభవించి ఇప్పుడు సీఎం, పార్టీని విమర్శిస్తున్న వారికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మాలోతు శకుంతల, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, తహసీల్దార్ తూమాటి శ్రీనివాస్, ఎంపీడీఓ చంద్రశేఖర్, డీఏఓ విజయనిర్మల, ఏడీఏ బాబురావు, ఏఓ కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, పీఆర్ డీఈ వెంకటరెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు రావూరి శ్రీని వాసరావు, పర్సా పట్టాభిరామారావు, ముత్యాల సత్యనారాయణ, దుగ్గినేని శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, ధరావత్ పాండ్యా నాయక్, భూక్యా రంగారావు, బానోతు బన్సీలాల్, అజ్మీరా అరుణ, ఈసం అరుణ తదితరులు పాల్గొన్నారు. కాగా, కారేపల్లిలో రైళ్ల హాల్టింగ్, ఫ్లై ఓవర్ నిర్మాణంపై కారేపల్లికి చెందిన ఇందుర్తి సురేందర్ రెడ్డి, పిల్లి వెంకటేశ్వర్లు తదితరులు ఎంపీకి వినతి పత్రాలను అందచేశారు.

ఫ్లెక్సీలో పొంగులేటి ఫొటో

అప్పాయిగూడెంలో రైతు వేదిక ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీ తదితరులకు స్వాగతం పలుకుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో ఇటీవల పార్టీని విబేధించిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫొటోలు దర్శనమిచ్చాయి. అలాగే, పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు ఫొటోలు కూడా ఉండడంతో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. అయితే, గతంలో సిద్ధం చేయించిన ఫ్లెక్సీలనే ఏర్పాటుచేసినట్లు చెప్పిన నాయకులు.. ఆతర్వాత పొరపాటు గుర్తించి తొలగించామని వెల్లడించారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పలు పాఠశాలల్లో రాష్ట్రబృందాల తనిఖీ



నేలకొండపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీధరాచార్యులు

నేలకొండపల్లి/పెనుబల్లి/ముదిగొండ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని రాష్ట్ర మానిటరింగ్ కమిటీ కోఆర్డినేటర్ శ్రీధరాచార్యులు సూచించారు. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లోని పలు పాఠశాలల్లో శ్రీధరాచార్యులు ఆధ్వర్యాన బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా మౌలిక భాష, గణిత సామర్థ్యాలను పరీక్షించిన వారు పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నాపత్రంపై అవగాహన కల్పించారు. అలాగే, ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థుల జీవితంలో పదో తరగతి కీలకమైనందున పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా బోధించాలని సూచించారు. వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈకార్యక్రమంల్లో రాష్ట్ర వనరుల బృందం సభ్యులు సలికినేని రాజశేఖర్, కన్నెగంటి వెంకటయ్య, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, నేలకొండపల్లి నోడల్ అధికారి అబ్రహం, హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి : మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధతను రాష్ట్ర స్థాయి బృందం మంగళవారం పరిశీలించింది. ఈసందర్భంగా విద్యార్థుల బోధన, ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర పరిశీలకులు కె.బాలమురళి, ప్రిన్సిపాల్ కె.నాగరాజు, ఉపాధ్యాయులు వెంకట్రావు, కిషోర్, కోటేశ్వరరావు, నరసింహారావు సత్యకుమారి, దుర్గాభవాని, సౌజన్య, నవీన దితరులు పాల్గొన్నారు.

ఎవరి ప్రయత్నాల్లో వారు !

- కౌన్సిలర్లను కాపాడుకోవడంపై బీఆర్‌ఎస్ దృష్టి
- అవిశ్వాసం వీగిపోయేలా పొంగులేటి వర్గం యత్నాలు

వైరా: వైరా మున్సిపాలిటీలో రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలు రాజకీయంగా వేడెక్కిస్తున్నాయి. వైరా మున్సిపల్ చైర్మన్‌పై అధికార బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు సోమవారం అందజేశారు. అప్పటి నుండి కౌన్సిలర్లను కాపాడుకునే యత్నంలో బీఆర్‌ఎస్ నేతలు నిమగ్నమయ్యారు. ఇదే సమయాన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు అవిశ్వాస నోటీసు వీగిపోయేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చైర్మన్‌గా చివరి వరకు కొనసాగుతామని పొంగులేటి వర్గీయులు, తమ చేతుల్లోకి చైర్మన్ గిరీ వస్తుందని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న ప్రచారం ఊపందుకుంది. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్మన్ అభివృద్ధి విషయంలో తమ వార్డులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలతో అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన నేపథ్యాన కావాలనే ఇదంతా చేస్తున్నారని పొంగులేటి వర్గం చెబుతోంది. ఈ పరిస్థితులతో అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా, అవసరమైతే న్యాయస్థానానికి వెళ్లాలనే యోచనలో పొంగులేటి వర్గం ఉన్నట్లు సమాచారం.

జింకల తండాలోనే ఇంజనీరింగ్ కాలేజీ!

రఘునాథపాలెం: ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యాన రెవెన్యూ అధికారులు రఘునాథపాలెం రెవెన్యూ పరిధి జింకలతండా క్రాస్ రోడ్డులో 15ఎకరాలను గుర్తించారు. ఈనెల 13న జేఎన్‌టీయూ, ఓయూ ప్రొఫెసర్లు ప్రతి పాదిత స్థలాన్ని పరిశీలించి కనీసం 50 ఎకరాల స్థలం కావాల్సి ఉంటుందని కలెక్టర్‌ను కలిసి వివరించారు. ఆతర్వాత తహసీల్దార్ నర్సింహారావు, సర్వేయర్ శ్రీనివాస్ రఘునాథపాలెంలోని సర్వే నంబర్ 30లో 30 ఎకరాల గుర్తించడమే కాక, అవసరమైతే మరో 30 ఎకరాలు సిద్ధంగా ఉందని ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు సరిపడా స్థలం అందుబాటులో ఉన్నందున జింకలతండా క్రాస్ రోడ్డులోనే ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

జిల్లాకు తగ్గిన ‘సాగర్’ ఇన్‌ఫ్లో

- చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతుల ఆందోళనలు
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్

ఖమ్మం అర్బన్: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుండి జిల్లా ఆయకట్టుకు అందాల్సిన జలాల ఇన్‌ఫ్లో లెక్కల ప్రకారం కొనసాగకపోవడంతో చివరి భూములకు నీరందడం లేదు. ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ధర్నాలకు దిగడం, ఈ అంశంపై ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇవ్వలేక తాము ఇబ్బంది పడుతున్నామని జలవనరులశాఖ ఇంజనీర్లు వాపోతున్నారు. ఇందులో భాగంగా ఒక సీఈ సెలవులో వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. వేసవి సాగు అవసరాల కోసం తొమ్మిది రోజులు ఆన్, ఆరు రోజులు ఆఫ్‌గా వారబందీ విధానంలో నీరు విడుదల చేస్తున్నారు. అయితే, పైనుంచి లెక్కల ప్రకారం నీరు రాకపోవడం.. ఇంకో పక్క కాల్వల్లో పూడిక, ఎండల ప్రభావం కారణంగా చివరి ఆయకట్టుకు నీరు అందకముందే సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా రైతులు ఆందోళన బాట పడుతున్నారు. సాగర్ ప్రాజెక్ట్ నుండి పాలేరు చెరువుకు ఇన్ ఫ్లో 6,400 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉన్నా ప్రస్తుతం రోజూ 3 వేల నుండి 3,200 క్యూసెక్కులే వస్తోందని అధికారులు చెబుతున్నారు. దీంతో స్థిరీకరించిన ఆయకట్టుకు నీరందడం లేదు. మరోపక్క సాగునీటి శాఖలన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చిన నేపథ్యాన పర్యవేక్షణ లోపిస్తోందని సమాచారం. కాగా, జిల్లాలో సాగర్ నీటి సరఫరాలో ఇబ్బందులపై కలెక్టర్ మంగళవారం జలవనరుల శాఖ అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేసినట్లు తెలిసింది. అయితే, పైనుంచి ఇన్‌ఫ్లో సరిగ్గా లేని సమయాన సరఫరాలో మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశముండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని అటు ఇంజనీర్లు, ఇటు రైతులు ఆందోళన చెందుతున్నారు.

మెడికల్ కళాశాలకు భవనాలు సిద్ధం

ఖమ్మం వైద్యవిభాగం: రాష్ట్రప్రభుత్వం జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయగా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పాత కలెక్టరేట్, ఆర్అండ్‌బీ, డీఎంహెచ్‌ఓ కార్యాలయాల స్థలాలను కేటాయించారు. ఈమేరకు 30 ఎకరాల స్థలం అందుబాటులోకి రావడం, ప్రభుత్వం కేటాయించిన రూ.166 కోట్లలో రూ.8 కోట్లు విడుదల చేయడంతో అధికారులు పాత కలెక్టరేట్‌లో పనులు ప్రారంభించారు. సివిల్ సప్లయీస్ భవనాన్ని ఆధునీకరించే పనులు చేపడుతుండగా, ఇతర భవనాలను సైతం రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నామని అధికారులు వెల్లడించారు. గత నెలలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు పరిశీలించిన నేపథ్యాన మరోమారు పరిశీలించాక మెడికల్ కాలేజీకి అనుమతులు జారీ చేసే అవకాశముంది.



భవనంలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

రోల్‌మోడల్‌గా ‘గోళ్లపాడు’

- అభివృద్ధి పనులకు రూ.100 కోట్ల వ్యయం
- పనులను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మంమయూరిసెంటర్: ఒకప్పుడు మురికికూపంగా ఉన్న గోళ్లపాడు చానల్‌పై పూర్తయిన ఆధునీకరణ పనులతో రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తయారైందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి గోళ్లపాడు చానల్‌ను అభివృద్ధి పనులను మంగళవారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తూ పరిశీలించారు. ఈ సందర్భంగా దశాబ్దాల క్రితం గోళ్లపాడు చానల్ ఎలా ఉంది, ఆధునీకరణ తర్వాత ఎలా మారిందనే చిత్రాలను చూపిస్తూ కలెక్టర్ పనులను వివరించారు. ఈక్రమంలో పార్కుల్లో వాకింగ్ చేస్తున్న వారితో కలెక్టర్ మాట్లాడి అభివృద్ధి ఎలా జరిగిందని ఆరా తీయగా వారు హర్షం వ్యక్తం చేశారు. పెద్దలు వాకింగ్, వ్యాయామం చేస్తుండగా పిల్లలు ఆడుకునేందుకు పార్కులో ఆటపరికరాలు ఏర్పాటుచేయడం బా గుందని పలువురు చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ 2016–17లో సీఎం కేసీఆర్ ఖమ్మం పర్యటన సందర్భంగా గోళ్లపాడు చానల్ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు రూ.56 కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. అనంతరం ప్రజలు, కార్పొరేటర్ల సహకారం, అధి కారుల కృషికి తోడు ఎప్పటికప్పుడు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యవేక్షిస్తుండడంతో రూ.100 కోట్ల నిధులతో పనులు చేపట్టామని తెలిపారు. చానల్ అంతా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీగా మార్చడంతో 32 ఎకరాల భూమి కేఎంసీ ఆధీ నంలోకి రాగా, పార్కులు, పట్టణ ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, బస్తీ దవాఖానా, యోగా కేంద్రం ఏర్పాటుచేశామని వివరించారు. ఇక చెస్ నేర్చుకునేందుకు పంజాబ్ నుండి ప్రత్యేకంగా తెప్పించిన కాయిన్స్ ఏర్పాటు చేశామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ద్వారా మురుగునీరు మున్నేరులో కలవడానికి ముందు శ్రీనివాసనగర్‌లోని ఎస్‌టీపీలో శుద్ధి జరుగుతుందని చెప్పారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో గోళ్లపాడు చానల్‌ను ఆధునీకరించి అద్భుతంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, కేఎంసీ ఎస్ఈ రంజిత్‌కుమార్, కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి, ఈఈ కృష్ణాలాల్, డీపీఆర్వో గౌస్ తదితరులు పాల్గొన్నారు.





గోళ్లపాడు అభివృద్ధి ఫొటోలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్ (ఇన్‌సెట్) వాకింగ్ చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్


నారాయణవరపు శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్/ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్తుపల్లికి చెందిన నారాయణవరపు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో మంగళవారం ఆయనకు జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పదిహేను ఏళ్లుగా బీసీ ఉద్యమ బలోపేతానికి శ్రీనివాస్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనంతరం శ్రీనివాస్‌ను సంఘం బాధ్యులు గుజ్జా కృష్ణ, లాల్ కృష్ణ, మేడేపల్లి కృష్ణమాచారి, అనంతయ్య, అంజి, రాజేందర్, సాగర్ భూపేంద్ర, రామకోటి, సుధాకర్, లింగబోయిన పుల్లారావు, వెంకటాచారి, మరీదు ప్రసాద్, పంతంగి వెంకటేశ్వర్లు, రాఘవ, అశోక్ తదితరులు అభినందించారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్


సుజాతను సన్మానిస్తున్న అధ్యాపకులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకురాలు పి.సుజాతకు డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ డాక్టర్ హరి ఓం పర్యవేక్షణలో ఆమె 'భారతదేశంలోని కంపెనీల విలువ పెంచడంలో కార్పొరేట్ గవర్నెన్స్ పాత్ర' అంశంపై పరిశోధనాత్మక గ్రంథం సమర్పించారు. ఈమేరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాధా గోవింద్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రకటించగా మంగళవారం ఆమెను ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్.శాస్త్రి, అధ్యాపకులు అభినందించారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రైవేట్ అభ్యర్థులకు ప్రవేశం పొందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. సంబంధిత ట్రేడ్లలో మూడేళ్ల సర్వీసు పూర్తయి, జీపీఎఫ్/ఈపీఎఫ్ నంబర్ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. సీటీపీఏ, డీఎం సివిల్, డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్లలో రెండేసి సీట్లు, వెల్డర్ ట్రేడ్‌లో నాలుగు సీట్లు ఖాళీగా ఉండగా, ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈనెల 28వ తేదీలోగా వరంగల్‌లోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నేడు పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం, చంద్రుగొండ, జూలూరుపాడు, రఘునాథపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఆయన హాజరవుతారని మాజీ ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కార్మికులంతా ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లేబర్ కమిషనర్ వెంగమాంబ, తదితరులు

నేలకొండపల్లి: సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఖమ్మం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ చల్లా వెంగమాంబ సూచించారు. మండలంలోని తిరుమలాపురంలో మంగళవారం ఇఫ్టూ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ - శ్రమ్ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వెంగమాంబ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే కార్మికులు తప్పకుండా ఈ - శ్రమ్‌లో చేరాలని, జిల్లాలో ఇంకా లక్ష మంది కార్మికులు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు అవకాశం ఉన్నందున వెంటనే కార్మికులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఫ్యాకల్టీ కె.రాంబాబు, సామాజిక కార్యకర్త కనకంపూడి రవితో పాటు తేజావత్ అరుణ, వాసు, భూక్యా కోటేశ్వరరావు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు




(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	7,450	7,000
మిర్చి	18,500	14,000
మిర్చి తాలు	10,800	7,500
పత్తి	7,700	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,781

భూములపై హక్కు కల్పించండి..

- జాగీర్దార్ భూములపై విన్నవించిన సింగరాయపాలెం రైతులు
- కొణిజర్ల ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన ఆర్డీఓ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రనాథ్

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంలో ఆరు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న జాగీర్దార్ భూములపై తమకు హక్కు కల్పించాలని గ్రామానికి చెందిన సన్న, చిన్నకారు రైతులు కోరారు. సింగరాయపాలెం జాగీర్దార్ భూములపై మంగళవారం కొణిజర్ల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ అధ్యక్షత వహించగా.. గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులు హాజరైనా, జాగీర్దార్ వారసులు మాత్రం రాలేదు. దీంతో విచారణను వాయిదా వేస్తూ ఆర్డీఓ ప్రకటన చేశారు.

ఇదీ విషయం...

సింగరాయపాలెంలో 380 ఎకరాల జాగీర్దార్ భూములు ఉండగా, గ్రామ రైతులు జాగీర్దార్ వారసులైన పట్టాదారులు హైమదాబేగం, హసద్ అలీ, మోహినుద్దీన్ నుంచి సాదా అగ్రిమెంట్లపై కొనుగోలు చేసి 1960నుంచి సాగు చేసుకుంటున్నారు. అయితే, 1973లో సీలింగ్ భూముల చట్టం రావడంతో సదరు పట్టాదారులకు నోటీసుల ఇచ్చారు. కానీ పట్టాదారులు మాత్రం భూమి తమ పేరిట లేదని, సాదా అగ్రిమెంట్లపై రైతులకు అమ్మినట్లు వరంగల్ ట్రిబ్యునల్ కోర్టుకు విన్నవించారు. దీంతో భూమి అనుభవంలో ఉన్నవారి వివరాలు సేకరించాలని కోర్టు ఆదేశించగా, జాగీర్దార్ వారసులు 1990లో ఆర్డీవో కోర్టును ఆశ్రయించారు, అప్పటి నుంచి వాయిదాలకు సింగరాయపాలెం రైతులు హాజరవుతున్నా జాగీర్దార్ వారసులు మాత్రం రావడం లేదు. మంగళవారం నిర్వహించిన సమావేశానికి జాగీర్దార్ వారసుల తరఫు న్యాయవాది వచ్చి మరో వారం గడువు కావాలని కోరడం గమనార్హం.

ఇంకా ఎన్నాళ్లు చూడాలి?

జాగీర్దార్ వారసులు సమావేశాలకు రాకుండా వాయిదాలు కోరుతుండడంపై సింగారాయపాలెం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఎన్నాళ్లు తాము ఎదురుచూడాలని ప్రశ్నించారు. అయితే, వారం తర్వాత విచారణ చేపట్టి రైతులకు తగిన న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రైతుల నుంచి వాంగ్మూలాలు, సాదా అగ్రిమెంట్ కాగితాలను సేకరించారు. జెడ్పీటీసీ కవిత, తహసీల్దార్ దొడ్డారపు సైదులు, కొణిజర్ల, బోనకల్ ఎస్సైలు శంకరరావు, కవిత, రెవెన్యూ ఉద్యోగులు దామోదర్, సునీతతో పాటు వివిధ పార్టీల నాయకులు రాంబాబు, శ్రీనివాసరావు, కృష్ణార్జునరావు, రోషన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువయ్యేందుకు దోహదం

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న కడగంచి రమేష్

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజాఘోష, బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశాలు ప్రజలకు చేరువయ్యేందుకు దోహదపడుతున్నాయని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కడగంచి రమేష్ తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన సమావేశాలపై మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నంబూరి రామలింగేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వాన చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచించారు. అలాగే, ఎన్నికలు ఎప్పుడొచ్చినా సత్తా చాటేలా నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని తెలిపారు. మాజీ మంత్రి రవీంద్ర నాయక్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడగా, నాయకులు నరేంద్రరావు, శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లతో ఆర్థికాభివృద్ధి

చింతకాని: దళితబంధు పథకం ద్వారా యూనిట్లు ఏర్పాటుచేసుకున్న వారు సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. మండలంలోని లచ్చగూడెంలో దళితబంధు ద్వారా మంజూరైన డెయిరీ యూనిట్లను మంగళవారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. లబ్ధిదారులు తాము అభివృద్ధి చెందడమే కాక మరికొందరికి ఉపాధి కల్పించాలని తెలిపారు. కాగా, లబ్ధిదారులు గతంలో ఏం చేసేవారు, ఇప్పుడు ఆదాయం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ గురిజాల ఝాన్సీ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు గురిజాల హన్మంతరావు, శ్రీరాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి తరాన్ని సిద్ధం చేయడమే లక్ష్యం


శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: సమాజ గమనానికి రేపటి తరాన్ని సిద్ధం చేయడమే లక్ష్యంగా రెడ్ బుక్ డే, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ తెలిపారు. కవి, రచయిత అట్లూరి వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని శ్రీశ్రీ విగ్రహం వద్ద రెడ్‌బుక్, మాతృభాషా దినోత్సవం నిర్వహించగా ఆయన మాట్లాడారు. మాతృభాషలో నైపుణ్యం సాధించినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలమని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు మాట్లాడగా పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, నాటక రచయిత దేవేంద్ర, కవి మువ్వా శ్రీనివాస్‌రావు, గాయకుడు రౌతు రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

చింతకాని: గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరముందని అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. మండలంలోని నేరడలో మహాశివరాత్రి సందర్భంగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్న తరుణంలో 41 ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తున్న సంఘం బాధ్యులను అభినందించారు. కాగా, పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం శీలం రాంరెడ్డి మెమోరియల్ జట్లు మొదటి స్థానాల్లో నిలవగా వరుసగా రూ.40 వేలు, రూ.30వేల నగదు బహుమతులు అందజేశారు. ఆతర్వాత స్థానాల్లో నేరడ నేతాజీ యువజన సంఘం, చెరువుమాధారం, తనికెళ్ల, కాలనీ నాచారం, అడవిమద్దులపల్లి, కోమట్లగూడెం, తాటిపాముల జట్లు నిలిచాయి. సర్పంచ్ గొర్రెముచ్చు ఈశ్వరమ్మ, వైరా సీఐ సురేష్, ఎస్సై పి.వెంకన్న, నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపకుడు దూసరి శ్రీరాములుతో పాటు దూసరి గోపాలరావు, కొల్లి యామిని, నేతాజీ పాల్గొన్నారు.

తీర్థాల జాతర ఆదాయం రూ.35.46లక్షలు

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాల సంగమేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.35.46లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ శేషయ్య తెలిపారు. వేలం పాటల ద్వారా రూ.13.72లక్షలు, టికెట్ల అమ్మకంపై రూ.13.05లక్షలతో పాటు హుండీ ఆదాయం ద్వారా రూ.8.68లక్షలు వచ్చాయని వెల్లడించారు. హుండీ లెక్కింపులో తహసీల్దార్ సుమ, ఎంపీపీ బెల్లం ఉమ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వరస్వామి ఆదాయం రూ.9.46లక్షలు

వైరారూరల్: వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.3,14,606, షాపుల వేలం ద్వారా రూ.1,67,916, లడ్డూ ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,14,500, హుండీ ఆదాయం రూ.3,13,529తో పాటు ఇతరత్రా కలిపి రూ.9,46,359 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ సూర్యదేవర శ్రీనివాస్ వెల్లడించారు. ఈమేరకు హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ చైర్మన్ చింతనిప్పు రాంబాబు, సర్పంచ్ అమ్మిక రామారావు, అర్చకులు కంచల చంద్రశేఖర్‌శర్మతో పాటు మల్లు రామకృష్ణ, చుండూరు రవి, తూము కోటేశ్వరరావు, కొరివి చంద్రరావు, కొండపాని వెంకటేశ్వరరావు, బొమ్మిడాల సావిత్రి, మల్లు వెంగళరావు, పాల్గొన్నారు.

మృత్యుంజయ స్వామి ఆదాయం రూ.30.23 లక్షలు

మధిర: మధిరలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయానికి రూ.30.23లక్షల ఆదాయం సమకూరింది. హుండీల్లోని నగదుతో పాటు ప్రత్యేక అభిషేకం, దర్శనం, వేలం ద్వారా రూ.30.23లక్షల ఆదాయం నమోదైందని ఈఓ జగన్మోహన్‌రావు తెలిపారు. కాగా, గత ఏడాది రూ.20,54,939 ఆదాయమే రాగా, ఈసారి రూ.9లక్షలకు పైగా పెరిగిందని పేర్కొన్నారు.

చనిపోతూ నలుగురికి ప్రాణం

- రోడ్డు ప్రమాదంతో ఖమ్మం మహిళకు బ్రెయిన్‌డెడ్
- వైద్యుల సూచనలతో అవయవదానం చేసిన కుటుంబీకులు


ప్రమీల (ఫైల్)

ఖమ్మంఅర్బన్: అమ్మగా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చిన ఆ తల్లి.. చనిపోతూ తన అవయవాలను దానం చేయడం ద్వారా మరో నలుగురికి పునర్జన్మనిచ్చింది. వివరాలు... ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలో కిరాణం షాపు నిర్వహించే గోరింకల ప్రమీల(45) తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై గత శుక్రవారం ఆలయానికి వెళ్లి వస్తుండగా పోలీసు కాలనీలో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి కింద పడింది. ఈమేరకు ఆమె తలకు బలమైన గాయం కావడంతో ఖమ్మంలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించగా ప్రమీల బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు సోమవారం నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆమె అవయవాలు దానం చేస్తే మరో నలుగురికి ప్రాణభిక్ష పెట్టొచ్చని కుటుంబీకులకు వైద్యులు అవగాహన కల్పించడంతో ప్రమీల భర్త శ్రీను, ఇద్దరు కుమార్తెలు అంగీకరించారు. దీంతో ఆమె గుండె, లివర్, కిడ్నీలు, కళ్లను తీసి వైద్యులు అవసరమైన వారికి అమర్చారు. అనంతరం మంగళవారం ప్రమీల మృతదేహాన్ని మంగళవారం టేకులపల్లికి తీసుకురాగా, పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొని ఆమెకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తాను చనిపోతూ నలుగురికి ప్రాణదానం చేసిన ప్రమీలకు కృతజ్ఞతలు చెబుతూ సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్టులు చేశారు.

వివాహితపై అత్యాచారయత్నం

ఏన్కూరు: అత్యాచారయత్నం జరిగిందని వివాహిత చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. మండలంలోని భద్రుతండాకు చెందిన వివాహిత, ఆమె భర్త ఈనెల 19న రాత్రి నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన బానోతు సీతారాం ఆమె చేయి పట్టి లాగి అత్యాచారానికి యత్నించాడు. ఈ సమయాన భర్త మేల్కొనడంతో సీతారాం పారిపోగా, కొద్దిరోజులుగా తనను వేధిస్తున్నట్లు బాధితురాలు చేసిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఖమ్మంలో అదృశ్యం.. హైదరాబాద్‌లో ప్రత్యక్షం

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పరిధిలో గత శుక్రవారం అదృశ్యమైన మైనర్ బాలిక హైదరాబాద్‌లో ప్రత్యక్షమైంది. దీంతో కుటుంబసభ్యులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. వన్‌టౌన్ ప్రాంతంలోని సీక్వెల్ రిసార్ట్స్ సమీపాన నివసిస్తున్న ఏడో తరగతి విద్యార్థినిని తల్లిదండ్రులు మందలించడంతో ఎవరికీ చెప్పకుండా పక్కింటి వారితో కలిసి వెళ్లిపోయింది. దీంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ విషయం తెలిసి ఆమెను తీసుకెళ్లినన వారు హైదరాబాద్ మణికొండలోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు ఫోన్ చేశారు. దీంతో బాలికను తీసుకురావడానికి మంగళవారం వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

ఒక్కరా.. ఇద్దరా..!

రూపం, గుణంలో ఒకే పోలిక • నేడు కవలల దినోత్సవం

కవలలు రూపం, గుణంలో ఒకే పోలికతో ఉంటారు. తల్లిదండ్రులు పేర్లు కూడా సారూప్యత ఉండేలా పెడుతుంటారు. బంధువులు, ఇరుగుపొరుగువారు వారిని గుర్తుపట్టలేక తికమక పడుతుంటారు. అయితే కొందరిలో ఇష్టాలు, అభిరుచులు భిన్నంగా కూడా ఉంటాయి. నేడు కవలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– ఖమ్మంగాంధీచౌక్/నేలకొండపల్లి


అనుదీప్, మణుదీప్

● ముచ్చట గొలిపేలా..

ఖమ్మం త్రీ టౌన్‌లోని పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన మార్కెట్ ఉద్యోగి తలారి సురేష్ – మహాలక్ష్మి దంపతులకు కవల పిల్లలు అనుదీప్, మణుదీప్ ఉన్నారు. ముచ్చట గొలిపేలా కనిపించే వీరిద్దరు యూనిఫాంతో స్కూల్‌కు వెళ్తుంటే గుర్తించేందుకు పలువురు తికమక పడుతుంటారు. అలాగే, పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు కూడా ఒక్కసారిగా చూస్తే గుర్తించడం కష్టమేనని చెప్పాలి. ప్రస్తుతం వీరిద్దరు ఐదో తరగతి చదువుతున్నారు.

● ఒకరికి ఒకరు ప్రతిరూపంగా..

నేలకొండపల్లి మండలం బైరవునిపల్లికి చెందిన గోపి ఉపేందర్‌రావు–నాగలక్ష్మి దంపతులకు వర్షిణి –హర్షిణి కవల పిల్లలు ఉన్నారు. వీరి వయస్సు పదేళ్లు కాగా ఒకరికి ఒకరు ప్రతిరూపంగా కనిపిస్తారు. ఒకరిని వదిలి ఇంకొకరు ఉండలేరు. అభిప్రాయాలు, ఇష్టాలు, అభిరుచులు అన్నీ ఒకే తీరుగా ఉంటాయి. ఒకరంటే ఒకరు అవాజ్యమైన ప్రేమ కనబరిచే వీరిద్దరు బైరవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు.


వర్షిణి, హర్షిణి


అజయ్‌రెడ్డి, ఉమేష్‌రెడ్డి

● గుర్తుపట్టలేనంతగా..

ఈ కవల సోదరులను గుర్తించడం ప్రతిరోజు చూస్తున్న కాలనీ వాసులకు కూడా సాధ్యం కాదు. ఖమ్మంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న తిప్పని నరసింహారెడ్డి–కల్పన కవల పిల్లలు అజయ్‌రెడ్డి, ఉమేష్‌రెడ్డి చూడటానికి ఒకే రూపంలో ఉంటారు. నగరంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. వీరు వెళ్తుంటే ఒకరి పేరుతో మరొకరిని పిలిచే సంఘటనలు అనేకం ఉన్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం: దేశంలో ఎక్కడాలేని విధంగా అంధత్వాన్ని రూపుమాపేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు పథకాన్ని ప్రజలనుసద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంలో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అలాగే, సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన జెడ్పీ చైర్మన్, పలువురి కుటుంబాలను పరామర్శించారు. తహసీల్దార్ తిరుమలాచారి, సర్పంచ్ యరమల రేణుక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావుతోపాటు చావా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సోమన్న పాట చిత్రీకరణ


సోమన్నతో వైఎస్సార్ టీపీ నాయకులు

రఘునాథపాలెం: వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న పాట చిత్రీకరణలో భాగంగా మంగళవారం రఘునాథపాలెం వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నడుమ ఆయన పాట చిత్రీకరించారు. కాగా, తొలుత ఖమ్మంలో సోమన్నను వైఎస్సార్ టీపీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జి తుంపాల కృష్ణమోహన్ తదితరులు కలిసి సన్మానించారు.

కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఖమ్మం, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో బనిగండ్ల ఫ్రెండ్స్‌యూత్, కల్లూరు, శీలం వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ టీమ్, మోటమర్రి, తెల్లపాలెం, సింగారం జట్లు మొదటి ఆరు స్థానాల్లో నిలవగా మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, ఆలయ చైర్మన్ సిలివేరు వెంకటేశ్వర్లు, అర్చకులు కాశావఝుల నర్సింహామూర్తి, పీఈటీ జీవీఎస్ఎన్.రెడ్డి తదితరులు

క్లుప్తంగా...

22న శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: మార్చి, ఏప్రిల్, మే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటిలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన మిగతా ఆర్జిత సేవా టికెట్లకు ఆన్‌లైన్ లక్కీడిప్ నమోదు ప్రక్రియ 22న ఉదయం 10 గంటల నుంచి 24న ఉదయం 10 గంటల వరకు ఉంటుంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి సేవను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.



చెన్నారంలో చెరకు తోటలను పరిశీలిస్తున్న చరణ్‌జిత్‌సింగ్, అధికారులు

మా దేశానికి రండి.. భూమి కౌలుకిస్తాం

చెరకు రైతుల సాగు విధానం భేష్..
ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్

నేలకొండపల్లి: 'చెరకు రైతుల సాగు విధానం బాగుంది.. ఆసక్తి ఉన్న రైతులు మా దేశానికి వస్తే భూమి కౌలుకు ఇప్పిస్తాం.. ఇక్కడితో పోలిస్తే మా దేశంలో ఆదాయం ఎక్కువ వస్తుంది..' అని ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్ చెప్పారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీని చరణ్‌జిత్ సింగ్, ఫిజి దేశ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చెరకు సాగు, ధర, క్రషింగ్ వివరాలపై ఫ్యాక్టరీ ఎండీ నామా కృష్ణయ్యతో చర్చించారు. అనంతరం చెన్నారంలో చెరకు పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చరణ్‌జిత్ సింగ్ మాట్లాడుతూ చెరకు సాగు విధానం ఇక్కడ బాగుందని ప్రశంసించారు. రైతులు తమ దేశానికి వస్తే భూములు కౌలుకు ఇప్పిస్తామని ఆహ్వానించారు. అక్కడే ఓ రైతు ఆవులతో దుక్కిపాటు చేస్తుండగా... తమ దేశంలో గోవులను పూజిస్తామని, వ్యవసాయం చేయమని స్పష్టం చేశారు. మంత్రి వెంట ఫిజీ కార్యదర్శి ఈలా, ప్రభుత్వ సీఈవో విమల్‌దత్, మధుకాన్ సీజీఎం కోటయ్య తదితరులున్నారు.

సంక్షేమ సర్కారు ఆదర్శ పాలన

వీడ్కోలులో ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసలు

సాక్షి, అమరావతి: సమాజంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శప్రాయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారని అభినందించారు. రాజకీయ నేతల అంతిమ లక్ష్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సమాజ శ్రేయస్సే కావాలని, ముఖ్యమంత్రి జగన్ దీన్ని ఆచరణలో చూపిస్తున్నారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న విశ్వభూషణ్ హరిచందన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విజయవాడలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ గవర్నర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ''రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటం సంతోషదాయకం. సమాజంలో ఏ వర్గాన్ని విస్మరించకుండా సంక్షేమ పథకాలను అందిస్తుండటం నిజంగా అబ్బురం. వీటిపై మేం చాలాసార్లు చర్చించుకున్నాం. ఇన్ని సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు అన్ని నిధులు ఎలా సమకూరుస్తున్నారని ముఖ్యమంత్రి జగన్‌ను అడిగితే అంతా దేవుడి ఆశీర్వాదమని వినమ్రంగా బదులిచ్చారు'' అని గవర్నర్ చెప్పారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించి రాజ్యాంగ విలువలకు పెద్దపీట వేశారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సీఐపై దాడి కేసులో 11 మంది టీడీపీ నేతల అరెస్ట్

- టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి ఆస్పత్రికి, 10 మంది జైలుకు..
- టీడీపీ వారిపై మూడు, ఎమ్మెల్యే అనుచరులపై ఒక కేసు నమోదు



దాడిలో గాయపడిన సీఐ కనకారావు

గన్నవరం / నాగాయలంక (అవనిగడ్డ) / కోనేరు సెంటర్: కృష్ణాజిల్లా గన్నవరంలో విధి నిర్వహణలో ఉన్న సీఐ పి.కనకారావును కులం పేరుతో దూషిస్తూ, రాళ్లతో కొట్టి గాయపరిచిన కేసులో టీడీపీ నేతలకు కోర్టు రిమాండ్ విధించింది. వీరిలో టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని ప్రభుత్వాస్పత్రికి, పదిమందిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. గన్నవరంలో సోమవారం టీడీపీ నేతలు సృష్టించిన ఘర్షణకు సంబంధించి పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. వీటిలో మూడు టీడీపీ నేతలు, కార్యకర్తలపై.. ఒకటి ఎమ్మెల్యే అనుచరులపై నమోదైంది. పట్టాభి తనను కులం పేరుతో దూషించడమేగాక ఆయనతోపాటు దొంతు చిన్నా, జాస్తి వెంకటేశ్వరరావు మరో ఎనిమిది మంది తనను రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపర్చడంతోపాటు చంపేవిధంగా అనుచరులను ప్రేరేపించారని సీఐ కనకారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభి తదితరులపై అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే వంశీమోహన్ అనుచరులు యతేంద్రరామకృష్ణ, మోహన్‌రంగా తదితరులు తమ ఇంటికి వచ్చి బెదిరించినట్లు టీడీపీ నేత దొంతు చిన్నా భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. టీడీపీ నేతలు పట్టాభి, చిన్నా, వీరంకి గురుమూర్తి, లావు వంశీకృష్ణ, జాస్తి ఆదిశేషు, లావు వంశీకృష్ణ, చల్లగుళ్ల సందీప్, గురివిందగుంట దేవేందర్, ముప్పరాజు కార్తీక్, గుజ్జర్లపూడి బాబూరావు, కంచర్ల సూర్యప్రకాష్‌లను అరెస్ట్‌చేసి మంగళవారం స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. పట్టాభి తనను పోలీసులు కొట్టినట్లు ఆరోపించడంతో ఆయనకు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యచికిత్స చేసిన తర్వాత రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపరచాలని జడ్జి బి.శిరీష పోలీసులను ఆదేశించారు. మిగిలిన పదిమందికి రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు పట్టాభిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి, మిగిలినవారిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు.

పోలీసులతో పట్టాభి భార్య వాగ్వాదం

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పట్టాభి ఇంటివద్ద మంగళవారం ఆయన భార్య చందన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె నిరపరాధి అయిన తన భర్తను విడుదల చేయకపోతే డీజీపీ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించటంతో పోలీసులు అభ్యంతరం చెప్పారు. దీనిపై ఆమె పోలీసులతో పరుష పదజాలంతో వాగ్వాదానికి దిగారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

గన్నవరం ఘటనకు సంబంధించి మచిలీపట్నం, నాగాయలంకల్లో సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగి, పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. గన్నవరం నుంచి తొమ్మిదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు మచిలీపట్నంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో గన్నవరం టీడీపీకి చెందిన ఒక న్యాయవాది తొమ్మిదిమంది అనుచరులతో అక్కడికి వెళ్లి భద్రత విధుల్లో ఉన్న సిబ్బందిపై దౌర్జన్యం చేసి పోలీసులు నిర్బంధించిన తొమ్మిదిమంది నాయకులు, కార్యకర్తలను కార్లలో తప్పించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ జాషువ వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది జీపీఎస్ ద్వారా తప్పించుకున్న వారిని వెంబడించి నిమిషాల వ్యవధిలో న్యాయవాదితో సహా అందరినీ పట్టుకుని బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ వాణి ఫిర్యాదు మేరకు మొత్తం 19 మందిపై కేసు నమోదు చేశారు. గన్నవరం ఘటనకు సంబంధించి పోలీసులు అదుపులోకి తీసుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సోమవారం అర్ధరాత్రి నాగాయలంక పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆయన అనుచరులు, స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. బోడెని చూసేందుకు అనుమతించాలంటూ సీఐ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. టీడీపీ మహిళా నేత తలశిల స్వర్ణలత, కొందు తెలుగు తమ్ముళ్లు సచివాలయ మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా మాట్లాడారు. బోడె ప్రసాద్‌ను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

రెచ్చగొట్టి మరీ రచ్చ రచ్చ
గన్నవరం ఘటనలో బరితెగించిన టీడీపీ
వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రంలో భారీ లోపం

- 800 మెగావాట్ల తొలి యూనిట్ సిద్ధమైనా ట్రయల్ రన్ వాయిదా
- నాసిరకం రీహీటర్ ట్యూబ్స్ లీకేజీయే కారణం
- 7,500 చోట్ల మరమ్మతులు అవసరం.. వాటి పూర్తికి మరో నెల సమయం
- మార్చి చివరిలో తొలి యూనిట్‌లో ఉత్పత్తికి అవకాశం
- జూలైలో రెండో యూనిట్‌లో ఉత్పత్తికి ప్రణాళికలు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలో 1600 (2x800) మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో భారీ లోపం బయటపడింది. విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల తొలి యూనిట్ నిర్మాణం పూర్తయినా బాయిలర్‌లోని రీహీటర్ ట్యూబ్స్ విఫలం కావడంతో గత డిసెంబర్‌లో జరగాల్సిన ట్రయల్ రన్ వాయిదా పడింది. మరమ్మతుల్లో భాగంగా ఈ గొట్టాలకు లోపాలున్న చోట కట్ చేసి వెల్డింగ్ చేస్తున్నారు. ఏకంగా 7,500 చోట్ల వెల్డింగ్ చేస్తున్నారని, ఇందుకు మరో నెల రోజుల సమయం పట్టనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఆలోగా మరమ్మతులు పూర్తయితే మార్చిలో తొలి యూనిట్ ద్వారా ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తి జరిపి ట్రయల్ రన్ నిర్వహించే అవకాశాలున్నాయి.

రీహీటర్ ట్యూబులే కీలకం

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో హై ప్రెషర్, ఇంటర్మీడియేటరీ ప్రెషర్, లో ప్రెషర్ టర్బైన్లు ఉంటాయి. బాయిలర్లలో వేడిచేసిన నీళ్లు ఆవిరిగా మారి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రత, భారీ పీడనంతో గొట్టాల ద్వారా 'హైప్రెషర్ టర్బైన్'లోకి ప్రవేశించి దాన్ని తిప్పుతూ మళ్లీ వెనక్కి మళ్లుతుంది. బాయిలర్‌లోకి తిరిగి చేరే సమయానికి ఆవిరి ఉష్ణోగ్రత 300 సెంటిగ్రేడ్‌లకు పడిపోతుంది. రీహీటర్ ట్యూబ్స్‌లో మళ్లీ 600 సెంటిగ్రేడ్‌లకు వేడెక్కిన తర్వాత 'ఇంటర్మీడియేటరీ ప్రెషర్ టర్బైన్'లోకి గొట్టాల ద్వారా ఆవిరి ప్రవేశించి దాన్ని తిప్పుతూ చివరకు 'లో ప్రెషర్ టర్బైన్ 'లోకి చేరుతుంది. అక్కడ చల్లబడిన ఆవిరి మళ్లీ బాయిలర్‌లోకి నీళ్ల రూపంలో ప్రవేశిస్తుంది. మళ్లీ ఆవిరిగా మారి 'హై ప్రెషర్ టర్బైన్' లోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రక్రియ అంతా ఒక లూప్‌గా జరుగుతుంది. నీళ్లు రీసైకిల్ అవుతూ ఉంటాయి.



నాసిరకం గొట్టాలతో సమస్యే

ఆవిరి టర్బైన్లను తిప్పడం ద్వారా వెలువడే యాంత్రికశక్తిని ఎలక్ట్రిక్ జనరేటర్ విద్యుచ్ఛక్తిగా మార్చుతుంది. ఈ ప్రక్రియలో కీలకమైన 'రీహీటర్ ట్యూబ్స్'లో నాణ్యత లేకుంటే అవి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలతోపాటు తీవ్ర పీడనాన్ని తట్టుకోవడం సాధ్యం కాదు. నాసిరకం ముడిసరుకుతో తయారైన గొట్టాలు తరచూ కోతకు గురికావడం, తుప్పుపట్టడం జరుగుతుందని నిపుణులు అంటున్నారు. దీంతో ఆవిరి ఉష్ణోగ్రతలు పడిపోయి విద్యుదుత్పత్తి నిలిచిపోతుందని చెబుతున్నారు. రీహీటర్ ట్యూబ్స్‌లో వచ్చే సమస్యలతోనే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి అధిక శాతం అంతరాయాలు కలుగుతాయి. దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్న గొట్టాలను ఎన్టీపీసీ వినియోగించినా విఫలం కావడంపట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి వెల్డింగ్ చేసి మరమ్మతులు చేసినా భవిష్యత్తులో అవి మళ్లీ విఫలమయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. రీహీటర్ గొట్టాలకు లీకేజీలతో గత డిసెంబర్‌లో నిర్వహించాల్సిన తొలి యూనిట్ సింక్రనైజేషన్ ప్రక్రియ వాయిదా పడింది.

నిర్మాణ జాప్యంతో రాష్ట్రంపై భారం

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని తొలి యూనిట్ నుంచి 2020 జూన్‌లో, రెండో యూనిట్ నుంచి 2020 నవంబర్ నాటికి వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తి (సీఓడీ) ప్రారంభం కావాల్సి ఉంది. కానీ నిర్మాణంలో జాప్యంతో తొలి యూనిట్ గడువును 2023 మార్చి, రెండో యూనిట్ గడువును 2023 జూలైకు ఎన్టీపీసీ పొడిగించింది. రీహీటర్ ట్యూబ్స్ విఫలం కాకుంటే గత జనవరి నాటికి తొలి యూనిట్, మార్చి నాటికి రెండో యూనిట్ అందుబాటులోకి వచ్చేదని అధికార వర్గాలు తెలిపాయి. వేసవి విద్యుత్ అవసరాల కోసం ప్రస్తుతం రాష్ట్రం ఒక్కో యూనిట్‌ను సగటున రూ.7.20 ధరకు నిత్యం రూ.60 కోట్ల విలువైన విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల నుంచి కొంటోంది. ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం సకాలంలో పూర్తై ఉంటే యూనిట్‌కు రూ. 5 ధరతో విద్యుత్ లభించేది. దీంతో అధిక ధర విద్యుత్ కొనుగోళ్ల భారం తప్పేదని, ప్రస్తుత ఫిబ్రవరిలోనే రూ.50 కోట్ల మేర ఆదా అయ్యేవని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

జిల్లా వార్తలు

సమష్టి కృషితోనే వార్షిక లక్ష్యసాధన

సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల లక్ష్యసాధనకు అందరూ కలిసి కృషి చేయాలని డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే.శ్రీనివాస్ కోరారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధిస్తేనే సంస్థకు లాభాలు రావడంతోపాటు ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, సౌకర్యాల కల్పనకు యజమాన్యం కృషి చేస్తుందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు నలభై రోజుల సమయమే ఉన్నందున సంస్థ వ్యాప్తంగా రోజు, నెలవారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కాగా, వీకే-7, జేకే ఓసీలకు త్వరలోనే అన్ని అనుమతులు వచ్చేలా యాజమాన్యం చర్యలు చేపట్టారని తెలిపారు. కాగా, భోపాల్‌లో కేంద్ర గనుల అనుమతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సింగరేణి అధికారులు పాల్గొనగా, త్వరలో కొత్త గనులు వచ్చే అవకాశం ఉందని డైరెక్టర్ శ్రీనివాస్‌ఈ సందర్భంగా వెల్లడించారు.

రేపు ఉమ్మడి జిల్లా ఆర్చరీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి సీనియర్స్ ఆర్చరీ ఎంపిక పోటీలను గురువారం(23వ తేదీ) నిర్వహించనున్నారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని గ్రేస్ చిల్డ్రన్ స్కూల్‌లో సీనియర్ పురుషుల, మహిళల ఆర్చరీ ఎంపికలు జరుగుతాయని ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. వివిధ విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరగనుండగా, ఇక్కడ ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

ఈ 40 రోజులూ ధ్యానమే..



దీక్షలకు ముస్తాబైన ఇల్లెందు మండలంలోని సుంకరగూడెం చర్చి

- నేటి నుంచి క్రైస్తవుల ఉపవాస దీక్షలు
- ఏప్రిల్ 10 ఈస్టర్ వరకు కొనసాగింపు
- ప్రార్థనలకు సిద్ధమవుతున్న మందిరాలు

ఇల్లెందురూరల్: ప్రార్థన, ప్రాయశ్చిత్తం, ఉపవాస దీక్షలు.. ఇదీ క్రైస్తవుల 40 రోజుల దీక్షల సారాంశం. బుధవారం నుంచి మొదలయ్యే ఈ దీక్షలకు జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సమాయత్తమవుతున్నారు. ఏటా ఆచరించే ఉపవాస దీక్షలను బసవ బుధవారంతో ఆరంభించి ఈస్టర్ పండుగతో ముగిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని చర్చిల్లో నేడు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.


ఇదీ నేపథ్యం..

సమస్త మానవాళి రక్షణ కోసం ఏసుక్రీస్తు లోకానికి వచ్చి 40 రోజులు శ్రమించి కల్వరి గిరిలో శిలువపై బలయ్యాడని బైబిల్ చెబుతోంది. మానవులు చేసిన పాపాల నుంచి ప్రాయశ్చిత్తం పొందాలంటే రక్తం చిందించాలని, అయితే భక్తుల కోసం ఏసు ప్రభువే శిలువపై మరణం పొందాడని పలువురి విశ్వాసం. శిలువ వేయక ముందు ఏసు అనుభవించిన శ్రమను ఈ ఉపవాస దీక్షల్లో ధ్యానిస్తారు. యూదుల సంప్రదాయంలో 40తో ముడిపడి ఉన్న సంఘటనల నేపథ్యంలో ఈ 40 రోజుల దీక్షను ఆచరించినట్లు చెబుతారు. దైవకుమారిడిగా శ్రమను జయించే శక్తి ఉన్నా.. మానవుడి మాదిరిగా జీవితాన్ని చూపడానికి ఏసుక్రీస్తు శ్రమను అనుభవించాడని క్రైస్తవులు స్మరించుకుంటారు. ఈ 40 రోజుల ప్రార్థనలు ఉపవాసం, ప్రాయశ్చిత్తం అనే అంశాలపైనే సాగుతుంది. ఈ దీక్షా కాలంలో క్రైస్తవులు తాము చేసిన పాదుపును సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం ద్వారా ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో నడుచుకుంటారు. ఇలా 40 రోజుల పాటు ప్రతి బుధ, శుక్రవారాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

ఏసు త్యాగాన్ని స్మరించుకుంటూ..


2వేల సంవత్సరాల క్రితం ఏసు శిలువ వేసుకుని మరణం పొందారని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు బసవ బుధవారం నుంచి ఈస్టర్ పండుగ వరకు 40 రోజులు ఉపవాస దీక్ష ఆచరిస్తారు. వీటినే 'లెన్ట్ డేస్' అంటారు. ఏటా క్రైస్తవుల క్యాలెండర్‌ను అనుసరించి ఈ లెన్ట్ డేస్‌ను నిర్ణయిస్తారు. ఈ సమయంలో భక్తిశ్రద్ధలతో ఏసును స్మరించుకుంటూ దీక్షను ఆచరిస్తారు. ఈ ఉపవాస దినాలు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ ఈస్టర్ పండుగ వరకు కొనసాగుతాయి. ఏసుక్రీస్తు శిలువపై మరణించి సమాధి చేయబడిన మూడో రోజున తిరిగి లేచే సందర్భంగా ఈస్టర్ పర్వదినాన్ని జరుపుకుని లెన్ట్ డేస్‌ను ముగిస్తారు.

భక్తిశ్రద్ధలతో ఆచరిస్తాం




ఏసు త్యాగాన్ని స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాస దీక్షను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తాం. అనునిత్యం ఆయన స్మరణలోనే ఉంటూ ప్రార్థన చేస్తుంటాం. ఏసు చూపిన శాంతిమార్గంలో పయనిస్తాం. ఈ మాసంలో చేసిన పొదుపును సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం.
– చీమ లక్ష్మయ్య, బాలాజీనగర్, ఇల్లెందు మండలం

ఈస్టర్ వరకు దీక్షలు చేస్తాం



బసవ బుధవారం నుంచి ఈస్టర్ పండుగ వరకు 40 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరిస్తాం. ఈ 40 రోజులు ఏసు జనన, మరణ నేపథ్యాలను స్మరించుకుంటూ ధ్యానం చేస్తాం. ఆయన సందేశాన్ని సర్వమానవాళికి వివరించి ప్రపంచ శాంతికి పాటుపడుతాం.
– కరకపల్లి సరోజనమ్మ, కొమరారం

ఆధ్యాత్మికంగా నిలబడటానికే..



బసవ బుధవారం నుంచి శ్రమల రోజులు ప్రారంభమవుతాయి. ఈ 40 రోజులు ఉపవాస దీక్షలు ఆచరించడంతోపాటు చేసిన పొదుపును సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం. మనిషి భౌతికంగా ఉన్న కోరికలను అణచుకొని ప్రభువు చూపిన మార్గంలో నడవడానికి ఈ ఉపవాస దీక్షలు దోహదం చేస్తాయి.
– జకరయ్య, ప్రొస్బేట్ ఇన్‌చార్జ్, కొమరారం

సాగర్ నీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

ఎండిన మొక్కలు, పురుగు మందు డబ్బాలతో నిరసన




బోనకల్ కాల్వ బ్రిడ్జిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ అన్నదాతలు రోడ్డెక్కారు. వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిలోని బోనకల్ బ్రిడ్జిపై మంగళవారం మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. బీబీసీ పరిధిలోని దాములూరి మేజర్ కింద బోనకల్ మండలంలోని మోటమర్రి, ఆళ్లపాడు, గోవిందాపురం (ఏ), మధిర మండలంలోని బయ్యారం, అల్లీనగరం, మడుపల్లి, ఇల్లూరు, రాయపట్నం రెవెన్యూ పరిధిలోని ఏడు వేల ఎకరాల్లో మిర్చి, మొక్కజొన్న, వరి, వేరుశెనగ పంటలను సాగుచేశారు. అయితే, సాగర్ జలాలను వారబందీ విధానంలో విడుదల చేస్తుండడంతో తమ పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని మధిర, బోనకల్ మండలాలకు చెందిన రైతులు రాస్తారోకోకు దిగారు. పంట చేతికందే సమయాన తమ పొలాల వద్దకు సాగర్ జలాలు రాకముందే ఆపేస్తుండడంతో నష్టపోయే అవకాశముందని తెలిపారు. బోనకల్ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట గత నెలలో ఆందోళన నిర్వహిస్తే పర్యవేక్షిస్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదని ఆరోపించారు. ఈమేరకు ఎండిపోయిన మిర్చి మొక్కలు, పురుగుల మందు డబ్బాలతో రాస్తారోకో చేపట్టగా, పోలీసులు, ఇరిగేషన్ అధికారులు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపాడు సర్పంచ్ మర్రి తిరుపతిరావుతో పాటు శాఖమూరి కోటేశ్వరావు, సూర్యదేవర సాంబశివరావు, పల్లిపాటి తిరపతిరావు, రైతులు పాల్గొన్నారు.

జన్మభూమికి సేవ చేయడం అదృష్టం


'నోష్' ల్యాబ్ ఎండీ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి



సత్యనారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

వేంసూరు: పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని హైదరాబాద్‌లోని నోష్ ల్యాబ్ ఎండీ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. వేంసూరు మండలం యర్రగుంటపాటుకు చెందిన ఆయన గ్రామంలోని రామాలయంలో ప్రతిష్ఠాపన పూజలు చేపట్టిన 16 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సుమారు రూ.50 లక్షల విలువైన ఫర్నీచర్ సమకూర్చడమే కాక, ఇతర వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సత్యనారాయణరెడ్డి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత, ఎంఈఓ సీహెచ్.వెంకటేశ్వరరావు, సర్పంచ్ గడ్డం కృష్ణకుమారి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'కట్టెకోల'కు సేవా శిరోమణి అవార్డు



చినసర్సయ్యను సన్మానిస్తున్న ఏపీ మంత్రి సత్యనారాయణ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఖమ్మంకు చెందిన కవి, రచయిత కట్టెకోల చిన నర్సయ్యను ఆంధ్రప్రదేశ్ అధికార బాషా సంఘం, ఎడిటర్స్ అసోసియేషన్ బాధ్యులు సత్కరించారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సమావేశంలో చిన నర్సయ్యను సన్మానించి మాతృభాష సేవా శిరోమణి అవార్డు అందజేశారు. ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ.వీ.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ ఛత్రునాయక్

మహబూబాబాద్ రూరల్: రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏఓలు, ఏడీఏలతో మంగళవారం ఏర్పాటుచేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రైతుబీమా, పంటల నమోదు, ఎరువుల సరఫరా తదితర అంశాలను రైతులందరికీ వివరించాలన్నారు. యాసంగిలో సాగవుతున్న పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో ఏడీఏలు లక్ష్మీనారాయణ, శోభన్‌బాబు, టెక్నికల్ ఏడీఏ రాజనరేందర్, టెక్నికల్ ఏఓలు సారయ్య, స్వామి పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

నర్సింహులపేట: పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. నర్సింహులపేటలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేయగా, డీఈఓ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో చదివితేనే ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎక్కువ మార్కులు సాధించేందుకు పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ రమేష్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ మహంకాలి బుచ్చయ్య, పరీక్షల విభాగం అధికారి విజయ సుశీల, మండల ప్రత్యేకాధికారి నర్సింహరావు, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, హెచ్‌ఎంలు శ్రీలత, అనంద్‌బాబు, సీఆర్‌పీలు శేషు, వీరన్న, రవి, నాగేష్, నరహరి పాల్గొన్నారు.